

శ్రీకంఠేశ్వర ఆలయ హుండీ ఆదాయం రూ. 1.69 కోట్లు

బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మైసూరు జిల్లాలో చారిత్రాత్మకమైన నంజనగూడు శ్రీకంఠేశ్వర ఆలయ హుండీలో రూ. 1.69 కోట్లు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆలయానికి అనుబంధంగా ఉండే 35 హుండీలు లెక్కించారు. రూ.1,69,69,867 నగదు, 134 గ్రాముల బంగారం, 2.350 కిలోల వెండి వచ్చాయని తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి దాకా లెక్కింపు ప్రక్రియ సాగినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి జగదీశ్‌కుమార్, తహసీల్దార్ విద్యులత, బ్యాంక్ మేనేజర్ టీకే నాయక్ ఉన్నారు. ఏప్రిల్‌లో లెక్కింపు వేళ రూ.1.72 కోట్ల ఆదాయం వచ్చింది.

- ఎత్తుకు పైఎత్తుల్లో సిద్దూ, డీకే
- తెరపైకి ఉపముఖ్యమంత్రి పదవులు
- డీకేను ఇరుకున పెట్టేలా సిద్దూ వర్గీయుల వ్యాఖ్యలు
- అధిష్ఠానానికి నివేదిక ఇవ్వడానికి డీకే కసరత్తు

ఆగని... అంతర్గత పోరు..!



సీఎం సిద్దరామయ్య



డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలో కీలక సారథుల మధ్య ఎత్తులు పైఎత్తులు సాగుతున్నాయి. ఏడాది పాలన ముగియడం, లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో మళ్లీ ముసుగు రాజకీయాలు తీవ్రమవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందే మరిన్ని సామాజిక వర్గాలకు ఉపముఖ్యమంత్రి పదవులు ఇవ్వాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చినా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హెచ్చరికతో ఎన్నికల దాకా మౌనం పాటించారు. లోక్‌సభ ఎన్నికల తంతు ముగియగానే ఈ అంశాన్ని సీనియర్ మంత్రి సతీశ్‌జార్కిహోళి ప్రస్తావించారు. అందుకు మద్దతు ఇచ్చేలా మంత్రులు రాజణ్ణ, జమీర్ అహ్మద్ వ్యాఖ్యానించారు. లింగాయత, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలలో ఒక్కొక్కరికి డీసీఎం పదవి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం కేబినెట్‌లో డీకే శివకుమార్ ఒక్కరే డీసీఎంగా ఉన్నారు. ఆయన ప్రాబల్యం ప్రభుత్వంలో తగ్గాలంటే మరింతమంది డీసీఎంలను చేయాలనేది ఎత్తుగడగా ఉంది. డీసీఎం ప్రతిపాదన చేసినవారంతా సీఎం సిద్దరామయ్యకు ఆప్తులైనవారే. ఇలా సాగుతుండగానే డీకే శివకుమార్‌కు ఆప్తులైన మంత్రి చలువరాయస్వామి, ఎమ్మెల్యే బాలకృష్ణ తదితరులు ప్రస్తుతానికి డీసీఎం పదవిలో డీకే శివకుమార్ ఉన్నారని, మరొక డీసీఎం అవసరం లేదన్నారు. మరో సీనియర్ మంత్రి ప్రియాంక ఖర్గే స్పందిస్తూ మంత్రులందరినీ డీసీఎంలు చేస్తే సరిపోతుందని వ్యాఖ్యానించారు. ఇలా సాగుతుండగానే చెన్నగిరి ఎమ్మెల్యే బసవరాజు శివగంగ కొత్త ప్రతిపాదన చేశారు. డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేస్తే సరిపోతుందన్నారు. ఈ అంశం సర్వత్రా చర్చకు దారితీసింది.

డీకే కట్టడి కోసమేనా..?

రాష్ట్ర ప్రభుత్వంలో ఏకైక ఉపముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న డీకే శివకుమార్ హవా అన్నింటా సాగుతోంది. అందుకు పలు కారణాలు ఉన్నాయి. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగాను, బెంగళూరు నగరాభివృద్ధి, కీలకమైన జలవనరుల శాఖ మంత్రిగాను వ్యవహరిస్తున్నారు. ఇలా డీకే శివకుమార్ కేబినెట్‌లో ప్రముఖుడిగా రాణిస్తున్నారు. దీనిని పలువురు సీనియర్ మంత్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. మరింతమంది డీసీఎంలను చేస్తే డీకే శివకుమార్ హవా తగ్గించవచ్చునని తరచూ ఈ అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన కొన్ని నెలల్లోనే ఈ డిమాండ్ వచ్చింది. ఇటీవల లోక్‌సభ ఎన్నికలకు ముందు హల్‌చల్ చేయగా తాజాగా వారం రోజులుగా హాట్ టాపిక్‌గా మారింది.

సిద్దూకు షాక్ ఇచ్చేలా డీకే నివేదిక

వివిధ సామాజిక వర్గాలకు డీసీఎం పదవులు కట్టబెట్టాలనే ప్రతిపాదన చేస్తూ డీకే శివకుమార్‌ను ఇబ్బంది కలిగించేలా సాగుతున్న కుట్రకు భారీగా షాక్ ఇచ్చేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత కోర్టు కేసు కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బెంగళూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఓటమిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని, ఎవరు పనిచేయలేదో సంబంధిత ఇన్‌చార్జ్‌లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. రాహుల్‌గాంధీ సూచనలను దృష్టిలో పెట్టుకుని లోక్‌సభ ఎన్నికల్లో 20 స్థానాలు విజయం సాధిస్తామనే ధీమాలో ఉన్నామని, ఎక్కడ విఫలం చెందామనే కోణంలోనే నివేదిక రూపొందించినట్టు తెలుస్తోంది. బెంగళూరుతోపాటు మైసూరు, దక్షిణకన్నడ, మండ్య, ఉత్తరకర్ణాటక ప్రాంతాల్లో ఇన్‌చార్జిలుగా వ్యవహరించినవారు సిద్దరామయ్యకు ఆప్తులు కావడంతో వీరిపై వ్యతిరేకంగా నివేదిక రూపొందించడం ద్వారా కట్టడి చేయాలని డీకే శివకుమార్ భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. మరోవైపు మాజీ మంత్రి వినయ్‌కులకర్ణి నేతృత్వంలో 15 మంది వీరశైవలింగాయత ఎమ్మెల్యేలు ఢిల్లీ వెళ్లి సీఎం ఆప్తమంత్రులు తమను నిర్లక్ష్యం చేస్తున్నారని ఫిర్యాదు చేయనున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా భైరతి సురేశ్, కేఎన్ రాజణ్ణను టార్గెట్ చేస్తూ ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. సిద్దరామయ్యను ఢిల్లీలో ఇరకాటంలో పెట్టేలా లక్ష్యంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీన్నిబట్టి సీఎం, డీసీఎం మధ్య అగాథం పెరుగుతున్నట్టు తెలుస్తోంది.

నేను లేకున్నా గ్యారెంటీలు ఉంటాయి : సీఎం

ఉపముఖ్యమంత్రి పదవుల గోల సాగుతుండగానే సిద్దరామయ్యను మార్పు చేయాలని కూడా పలువురు వ్యాఖ్యానిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ కుట్రలు ఎక్కడిదాకా సాగుతాయో అనేది కూడా కుతూహలంగా మారింది. లోక్‌సభ ఎన్నికల్లో ఊహించినన్ని సీట్లు రాకపోవడంతో కాంగ్రెస్ గ్యారెంటీలు రద్దు అవుతాయని బీజేపీ నిత్యం ఆరోపణలు చేస్తోంది. వీటికి దీటైన సమాధానం చెప్పేలా రెండు రోజుల కిందట ముఖ్యమంత్రి సిద్దరామయ్య తాను ముఖ్యమంత్రి పదవిలో లేకున్నా గ్యారెంటీలు కొనసాగుతాయని వ్యాఖ్యానించడం చూస్తే మరిన్ని ఊహాగానాలకు తావిస్తోంది. మరోవైపు నాయకత్వ మార్పునకు సంబంధించి అధిష్ఠానం వద్ద ఏమి తీర్మానం జరిగిందనేది ఎవరికీ తెలియని అంశంగా ఉంది.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి మునియప్ప

డీసీఎం రేసులో లేను

- రెండున్నరేళ్ల పదవీ కాలానికి కట్టుబడతాం
- జూలై ఆఖరుకు పెండింగ్ సొమ్ము చెల్లిస్తాం
- పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్ప

బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తాను ఉపముఖ్యమంత్రి కావాలని అనుకోవడం లేదని, ఆ రేసులో లేనని పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్ప స్పష్టం చేశారు. బుధవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ మరింతమందికి డీసీఎం పదవులు అనే అంశంపై స్పందించారు. రెండున్నరేళ్లపాటు మంత్రిగా కొనసాగాలనే అంశానికి కట్టుబడతామని తెలిపారు. రెండున్నరేళ్ల తర్వాత మంత్రులను మార్చాలనే విషయం సమంజసమైనదని అన్నారు. మరింతమందిని ఉపముఖ్యమంత్రులను చేయాలా, వద్దా అనేది అధిష్ఠానం నిర్ణయిస్తుందని తెలిపారు. గందరగోళమైన అంశాలు మాట్లాడబోనని పేర్కొన్నారు. అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను నెరవేర్చాలని తెలిపారు. అధిష్ఠానం ఏ పదవి ఇచ్చినా నిర్వహిస్తా అన్నారు. కొందరు మంత్రులు అధిష్ఠానాన్ని కలిసే విషయం తనకు తెలియదన్నారు. తాను ఎటువంటి డిమాండ్‌లు చేయనని, సామర్థ్యం చూసి అధిష్ఠానం పదవులు ఇస్తుందని పేర్కొన్నారు. ఇక పౌర, ఆహార సరఫరాలశాఖకు సంబంధించి తాము నాణ్యమైన బియ్యాన్ని ఇస్తున్నామని అన్నారు. ప్రతినెలా కోటాకు అనుగుణంగా నగదు బదిలీ చేస్తున్నామని తెలిపారు. జూలైతో అన్నభాగ్య ప్రారంభించి ఏడాది అవుతుందని, అప్పటికి పెండింగ్ ఉండే గ్యారెంటీ సొమ్ము జమ చేస్తామన్నారు.

వాల్మీకి కార్పొరేషన్ అవినీతిలో సీఎందే..

నైతిక బాధ్యత

- మంత్రి శరణు ప్రకాశ్, కార్పొరేషన్ చైర్మన్ రాజీనామా చేయాలి
- రేపు రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర



మీడియాతో విజయేంద్ర

బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ. 187 కోట్ల అవినీతికి ఆర్థికశాఖమంత్రిగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య నైతికబాధ్యత వహించాలని, ఇదే విషయమై ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి శరణు ప్రకాశ్‌పాటిల్, కార్పొరేషన్ చైర్మన్ రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 28న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేస్తామని తెలిపారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా గ్రాంట్లు కేటాయించి వారి ప్రగతికి పాటుపడాల్సి ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.187 కోట్లు దోచిందని ఆరోపించా. సామాన్యవర్గాల పట్ల ప్రభుత్వనీతి దారి తప్పిందన్నారు. సిట్ ద్వారా విచారణ జాప్యం చేసే ప్రక్రియ కొనసాగుతోందని ఆరోపించారు. మంత్రి నాగేంద్ర రాజీనామాతో సరిపెడితే అంగీకరించేది లేదని, తెలంగాణకు చెందిన బినామీ ఖాతాలకు నిధులు మళ్లించి లోక్‌సభ ఎన్నికల కోసం ఖర్చు చేశారని అన్నారు. గతంలోనూ భారీగా అక్రమాలకు పాల్పడ్డారని, అప్పట్లో ఏసీబీ ద్వారా ఎన్నో కేసులు బయటకు పొక్కకుండా చూశారని, ప్రస్తుతం సిట్ ద్వారా అదే విధానం కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నిత్యావసర ధరలు పెరిగాయన్నారు. పెట్రోలు, డీజిల్ ధరల పెంపు అన్నివర్గాలకు తీరనినష్టం మిగులుస్తోందన్నారు.



వైభవంగా శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవం

కదిరి, జూన్ 26: పట్టణంలో వెలసిన శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి ఆర్జిత కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్లను పట్టు వస్త్రాలు, కదిరి మల్లెలు, తులసి మాలలతో అలంకరించారు. స్వామి వారి కల్యాణం కనులపండువగా సాగింది.



జనస్పందనలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

కబ్బన్‌పార్క్‌లో సంస్కృత శిబిరం

- స్వచ్ఛందంగా వస్తున్న నగరవాసులు
- ప్రతి ఆదివారం ప్రత్యేకం

బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సంస్కృతభాషకు కర్ణాటకతో విడదీయరాని సంబంధం ఉంది. దైవభాషగా భావించే సంస్కృతం పురాతన కాలం నుంచి వచ్చింది. పురాతన గ్రంథాలు, ప్రాచీనశాసనాలు సంస్కృతంలోనే అత్యధికంగా ఉంటాయి. శివమొగ్గ జిల్లాలోని గ్రామమంతటా సంస్కృతభాషనే మాట్లాడతారు. అటువంటి ఓ పల్లె దేశంలో ఎక్కడా లేదు. వ్యాపార, ఉద్యోగ, విద్య వంటి అవసరాల కోసం బెంగళూరులో స్థిరపడినవారిలో సంస్కృతం నేర్చుకోవాలనే తపన పెరుగుతోంది. ఇలా కొందరితో ప్రారంభమైన సంస్కృతభాష నేర్చుకునే నడక పదుల సంఖ్యకు చేరింది. వీరంతా నగర నడిబొడ్డున ఉండే కబ్బన్‌పార్క్‌ను వేదికగా మార్చుకున్నారు. ఆదివారం ఉదయం వేలాదిమంది వాకింగ్ కోసం వస్తుంటే కొందరు మాత్రం సంస్కృతాన్ని నేర్చుకునేందుకు చేరుతున్నారు. సంస్కృతభాష నేర్చుకోవాలని భావిస్తున్నవారికి ఇదో సంతోషం కలిగించే అంశంగా మారింది. ఉదయం 7.30 గంటలకు కబ్బన్‌పార్క్ మెట్రో స్టేషన్ నుంచి సంస్కృత వాక్ ప్రారంభమవుతుంది. సభ్యులు సంస్కృతంలో మాట్లాడుకుంటూనే నడక సాగిస్తారు. సరళమైన పదాలను అనువాదం చేసుకుని వాటి అర్థం తెలుసుకుంటుంటారు. కొత్త భాష నేర్చుకోవాలని ఆసక్తి చూపేవారికి బృందం సభ్యులు సాదరంగా స్వాగతిస్తారు. ఇలా ప్రతి వారం కొత్తగా 20-40మంది చేరుతున్నారు. బ్యాండ్‌స్టాండ్ లేదా మరోచోట అందరూ చేరి సంస్కృతంలో సంఖ్యలను చెబుతారు. కాసేపు వ్యాయామం కొనసాగిస్తారు. దీంతోపాటు ధమ్ తమక్ అనువాదం, వ్యాసరచనలు, భాష నేర్చుకోవాలనుకునేవారికి ఆసక్తికరమైన అంశాలపై నైపుణ్యత కల్పిస్తారు. 16-40 ఏళ్ల మధ్య ఉండేవారంతా ఓ బృందంగా చేరి సంస్కృత వ్యవహారాలను కొనసాగిస్తారు. ఇందుకు ప్రత్యేక బ్లాగ్ ఏర్పాటు చేశారు. ఎంతోమంది సంస్కృతం నేర్చుకున్నా ఏమి చేయాలో తెలియదు. కొందరికి సంస్కృతం పట్ల ఆసక్తి ఉన్నా ఎలా నేర్చుకోవాలనేది తెలియదు. విద్యాసంస్థల్లో సంస్కృతం నేర్చుకున్నా మాట్లాడేందుకు వెనుకడుగు వేస్తున్నారు. సంస్కృతభాషను ప్రోత్సహించడంతోపాటు మరింతమందికి ప్రాచీనభాష పట్ల అవగాహన కల్పించడమే తమ ఆశయమని స్థాయి ఇన్ వ్యవస్థాపకురాలు సమష్టి గుబ్బి తెలిపారు. సంస్కృతభాషను బెంగళూరులోనే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు పూణె, ముంబై, కేరళలో నేర్పించేందుకు సంస్థ పనిచేస్తోందని వివరించారు.



సంస్కృత భాష నేర్చుకోవడానికి వచ్చిన వారు

తిట్టమారనహళ్లిలో డీసీఎం జనస్పందన

బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రామనగర జిల్లా చెన్నపట్టణ తాలూకా తిట్టమారనహళ్లిలో బుధవారం 'ఇంటి ముంగిటకే ప్రభుత్వం - సేవకు ఉండాలి సహకారం' పేరిట ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ జనస్పందన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి రామలింగారెడ్డి, గ్యారెంటీల అమలు కమిటీ చైర్మన్ రేవణ్ణ, ఎమ్మెల్సీలు పుట్టణ్ణ, రవి, రామోజిగౌడతోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీఎం మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండుచోట్ల కార్యక్రమాలు నిర్వహిస్తే మూడు వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. పేదలు, రైతులు పనులకోసం వస్తే లంచం కోరితే కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. రైతులు ప్రభుత్వ కార్యాలయాలకు పనుల నిమిత్తం వస్తారని వారిపట్ల నిర్లక్ష్యం చూపరాదని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక ఫోన్ నెంబరు ఏర్పాటు చేస్తామని, లంచం కోరితే ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఎవరికైనా ఓటు వేయని, వారి మద్దతు ఎవరికైనా ఉండనీ సమస్య ఉందంటూ వస్తే పరిష్కరించాల్సిందే అని అధికారులకు సూచించారు. ప్రజల చెంతకు వెళ్లాలనే నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం నుంచి విద్యార్థులకు బస్‌పాసులు ఇవ్వాలని ఆదేశించారు.

కాంగ్రెస్ నుంచి బసనగౌడ నామినేషన్

బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): శాసనసభ్యుల కోటాలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానం కోసం కాంగ్రెస్ పార్టీ నుంచి బసనగౌడ బాదర్లి బుధవారం మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. తొలిసెట్‌లో ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో కలిపి పదిమంది ప్రతిపాదించగా, రెండు, మూడు సెట్ల నామినేషన్లలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సహా పది మంది ప్రతిపాదించారు. ఎమ్మెల్యేల కోటాలో జరుగుతున్న ఎన్నిక కావడంతో కాంగ్రెస్‌కు ఉన్న మెజారిటీని బట్టి సునాయాసంగా గెలుపొందుతారు. ఇప్పటి వరకు ఆయన ఒక్కడే నామినేషన్ దాఖలు చేశారు. జగదీశ్‌శెట్టర్ రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి ఉప ఎన్నిక జరుగుతోంది.



బసనగౌడ బాదర్లి నామినేషన్‌లో సీఎం, డీసీఎం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

బంకించంద్ర ఛటర్జీ (జయంతి)



బెంగాలీ సాహిత్య సామ్రాట్‌గా పేరొందిన వందేమాతరం గేయ రచయిత, స్వరకర్త బంకించంద్ర ఛటర్జీ 1838 జూన్ 27న పశ్చిమబెంగాల్ రాష్ట్రం నైహతిలో జన్మించారు. బంకించంద్ర ఛటోపాధ్యాయగాను పిలుస్తారు. రచయిత, కవి, నవలా రచయిత, వ్యాసకర్త, పాత్రికేయుడిగా రాణించారు. పశ్చిమబెంగాల్ రాష్ట్ర సాహిత్యంలో తనదైన గుర్తింపు పొందారు. ఆయన రచించిన 'ఆనంద్ మఠ్' అనే నవల నుంచి వందే మాతరం గీతాన్ని సంగ్రహించారు. ఈ గీతం స్వాతంత్ర్య సంగ్రామంలో సమరశంఖంలా పని చేసింది. ఆయన స్వాతంత్ర్యోద్యమంలోనూ పాల్గొన్నారు. 1894 ఏప్రిల్ 8న కన్నుమూశారు.

హెలెన్‌కెల్లెర్ (జయంతి)



అంధులకు, బధిరులకు, మూగ వారికి వారధిగా నిలిచిన హెలెన్ అడమ్స్ కెల్లెర్ 1880 జూన్ 27న యునైటెడ్ స్టేట్స్ అలాబామా ప్రాంతం టస్కం బియాలో జన్మించారు. అమెరికా దేశ రచయిత్రి. చిన్న వయసులోనే కంటిచూపు కోల్పోయినా మనోధైర్యంతో ముందుకు సాగారు. దివ్యాంగుల ఉద్యమాల సారథిగా ప్రపంచస్థాయిలో పేరొంది ఎందరికో స్ఫూర్తినిచ్చారు. రాజకీయంగా కంటే అధ్యాపకురాలిగా తనదైన గుర్తింపు పొందారు. బ్రెయిలీ లిపిని మూడేళ్లలో ఆపోసన పట్టి హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి బీఏలో పట్టా పొందిన తొలి డెఫ్ బ్లైండ్ వ్యక్తి. అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్ సంస్థ ద్వారా అంధుల సంక్షేమానికి పాటుపడ్డారు. ప్రత్యేకించి మహిళల ఆరోగ్యం, కంటి చూపు, పౌష్టికతకోసం పనిచేశారు. ది ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం వంటి ఉన్నత ఉన్నత గౌరవాలు అందుకున్నారు. 1968 జూన్ 1న కన్నుమూశారు.

ఆర్‌డీ బర్మన్ (జయంతి)



సంగీతదర్శక దిగ్గజాలలో ఒకరైన రాహుల్ దేవ్ (ఆర్‌డీ) బర్మన్ 1939 జూన్ 27న కోల్కత్తాలో జన్మించారు. 1960- 90ల మధ్య దేశ సినీరంగంలో తనదైన ముద్రను చాటారు. 331 సినిమాలకు సంగీతాన్ని అందించారు. పాశ్చాత్య, లాటిన్, ఓరియంటల్, అరబిక్ శైలిల ప్రభావం ఆయన సంగీతంలో కనిపిస్తుంది. ఆయన సంగీత దర్శకత్వంలో ఆశాభోస్లే, కిశోర్‌కుమార్, లతా మంగేష్కర్ వంటివారు ఎక్కువగా పాటలు పాడారు. 3 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. 1994 జనవరి 4న కన్నుమూశారు.

పీటీ ఉష (పుట్టినరోజు)



పరుగుల రాణిగా పేరొందిన 'పద్మశ్రీ' గ్రహీత, పిలావుళ్లకండి తెక్కె పరంబల్ (పీటీ) ఉష 1964 జూన్ 27న కేరళ రాష్ట్ర కోజికోడ్ జిల్లా పయోలీలో జన్మించారు. 'క్వీన్ ఇండియన్ ట్రాక్ అండ్ ఫీల్డ్'గా పేరొం దారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పరుగులో సత్తా చాటుకున్నారు. 2019లో మూడు యూనివర్సిటీలు ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశాయి. అర్జున అవార్డు, వరల్డ్ ట్రోఫీ అవార్డు ఇతరత్రా పురస్కారాలు అందుకున్నారు. 13 బంగారు పతకాలు, ఇతర రివార్డులు సాధించారు. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా ఉన్నారు. కాగా రాజ్యసభకు నామినేట్ అయిన ఆమె వైస్‌ఛైర్ పర్సన్స్ కమిటీలో సభ్యురాలిగా ఉన్నారు. దీంతో రాజ్యసభ ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్‌లు లేని సమయంలో సభా పతిగా వ్యవహరించారు. ఇండియాస్ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యునైట్ నేషన్స్‌కు సలహాదారుడిగా ఉన్నారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

శిడ్లఘట్ట, జూన్ 26: ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క ను నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రధాన సివిల్ న్యాయాధికారి, తాలూకా లీగల్‌సెల్ మెంబర్ సెక్రటరీ పూజా అభిప్రాయపడ్డారు. తాలూకాలోని దేవరమళ్ళూరు గ్రామంలో మళ్ళూరాంబ దేవాలయ ఆవరణలో తాలూకా న్యాయసేవల సమితి నిర్వహించిన 101 మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రకృతి మనకు ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా శుద్ధ నీరు, గాలి, ఆహారం ఇస్తోందని అయితే మనం మాత్రం అభివృద్ధి పేరిట ప్రకృతి కాపాడకుండా నిర్లక్ష్యం చేస్తున్నామని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలకు మానవుడి స్వయంకృతాపరాధమే కారణమన్నారు. ఇకనైనా ప్రజల్లో మంచి మార్పు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వి సుబ్రమణ్యప్ప, మునిరాజుగౌడ, అమూల్య, గ్రామపంచాయతీ సభ్యులు ఎస్ వెంకటేశ్, రాజణ్ణ, ప్రముఖులు వేణుగోపాల్, మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు అస్వస్థత

గుత్తి రూరల్, జూన్ 26: మండల పరిధిలోని రజాపురంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా 20 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాలలో మొత్తం 620 మంది బాలికలు ఉన్నారు. రెండు రోజుల క్రితం ఐదుగురికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపించారు. బుధవారం ఉదయం 20 మంది బాలికలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే బేతాపల్లి వైద్యులకు ప్రిన్సిపాల్ సమాచారం అందించారు. డాక్టర్ ప్రవీణ్ కుమార్ బృందం పాఠశాలకు చేరుకుని బాలికలకు చికిత్స చేసింది. మంగళవారం రాత్రి చికెన్ తినడం వల్ల, కలుషిత నీరు తాగడం వల్ల అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

కొత్తచెరువు, జూన్ 26: ఇంటర్మీడియట్ ఫస్టియర్ సప్లిమెంటరీ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లా 18వ స్థానంలో నిలిచిందని డీఐఈఓ రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 3680 మంది పరీక్షలు రాయగా.. 1503 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. దీంతో 41 శాతం ఉత్తీర్ణత నమోదైందని ఆయన వెల్లడించారు.

ఓవర్‌లోడ్ వాహనాల సంచారానికి అడ్డుకట్ట

బాగేపల్లి, జూన్ 26: నియమాలు ఉల్లంఘించి ఓవర్‌లోడ్‌తో గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీల సంచారంతో రోడ్లు దెబ్బతింటున్నాయని వెంటనే ఓవర్‌లోడ్ వాహనాల సంచారానికి అడ్డుకట్ట వేయాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి సూచించారు. పట్టణంలోని తాలూకా పంచాయతీ సభాంగణంలో బుధవారం వివిధశాఖల ప్రగతి సమీక్ష నిర్వహించారు. గనులు భూవిజ్ఞానశాఖ, ఆర్టీఓ అధికారులకు పలు సలహా సూచనలు చేశారు. ఓవర్‌లోడ్ వాహనాల వల్ల రోడ్లు త్వరగా దెబ్బతింటున్నాయని వాటిని నియంత్రించాలని ఆదేశించారు. తాలూకాలోని గూళూరు హోబళి పరిధిలోని పలు గ్రామీణ రహదారుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. తాలూకాలోని 83 కేఎస్ఆర్టీసీ బస్సులు నిష్క్రియగా మారాయని ఒక్కో బస్సు సుమారు 9 లక్షల కిలోమీటర్లకుపైగా సంచరించడంతో పాతబడ్డాయన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలకోసం రవాణాశాఖమంత్రితో చర్చలు జరుపుతానన్నారు. కాగా కేంద్ర ప్రభుత్వ మహత్వ పథకమైన జలజీవన్ మిషన్ పథానికి పైప్‌లైన్ అమరిక పనులకోసం పలు చోట్ల రోడ్లు తవ్వడంతో అధ్వానంగా మారాయనే విమర్శలు వచ్చాయని, పైపుల అమరిక పూర్తైన చోట తిరిగి రోడ్డును బాగు చేయాలని ఆదేశించారు. డాక్టర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తాలూకాలోని పలు ఆసుపత్రులలో వైద్యుల కొరత ఉందన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చేపట్టాలని కోరారు. తాలూకాలో 67 చోట్ల శుద్ధతాగునీటి కేంద్రాలు పనిచేయడం లేదని వాటి నిర్వహణ పట్ల కంట్రాక్టర్‌లు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. వివిధశాఖల అధికారులు తమ సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో తహసీల్దార్ ప్రశాంత్ పాటిల్, ఈఓ రమేశ్, తాలూకా వైద్యాధికారి సత్యనారాయణరెడ్డి, బీఈఓ తనుజా, సహాయక వ్యవసాయ శాఖ డైరెక్టర్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

పీఈఎస్ బెస్ట్‌తో వీటీయూ ఒప్పందం



ఒప్పందంలో పాల్గొన్న ఇరు వర్సిటీల ప్రముఖులు

బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ యూనివర్సిటీకి అనుబంధంగా పని చేస్తున్న బజాజ్ ఇంజనీరింగ్ స్కిల్ ట్రైనింగ్ (బెస్ట్) కార్యక్రమాన్ని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకుంది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా వీటీయూకు అనుబంధంగా ఉండే కళాశాలల విద్యార్థులకు నైపుణ్య శిక్షణలు ఇచ్చేందుకు సులభతరం కానుంది. బజాజ్ ప్రముఖ సీఎస్ఆర్ కార్యక్రమమైన బెస్ట్ ద్వారా ఇంజనీరింగ్, డిప్లమో విద్యార్థులకు నిరంతరంగా నైపుణ్య శిక్షణలు ఇస్తున్నారు. పీఈఎస్ యూనివర్సిటీలో 40వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో తొలి కేంద్రం కొనసాగుతోంది. ఈమేరకు వీటీయూ రిజిస్ట్రార్ డాక్టర్ బీఈ రంగస్వామి, పీఈఎస్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నాగార్జున సాధినేనిలు సంతకాలు చేశారు. వీటీయూ వైస్ చాన్స్‌లర్ విద్యాశంకర్, వీటీయూ నైపుణ్యకేంద్రం డైరెక్టర్ డాక్టర్ సంధ్యా అన్వేకర్, పీఈఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ కేఎస్ శ్రీధర్‌ల సమక్షంలో ఒప్పందం కుదిరింది. వీటీయూ వీసీ మాట్లాడుతూ కోర్ ఇంజనీరింగ్ విభాగాల ద్వారా ప్రత్యేక శిక్షణలు ఇస్తున్నామని, బెస్ట్ ద్వారా మరింత సాంకేతికత అందుతుందన్నారు. పీఈఎస్ వైస్‌చాన్స్‌లర్ సూర్యప్రసాద్ మాట్లాడుతూ పీఈఎస్ ద్వారా 40కుపైగా ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని విద్యార్థులకు సాంకేతికత శిక్షణలు, సమాజంపై అవగాహన తదితర కార్యక్రమాలను చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి సూచనలకు అనుగుణంగా అమలు చేస్తున్నామన్నారు. బెస్ట్ ద్వారా మెకట్రానిక్స్, రోబోటిక్స్, ఆటోమేషన్, మోషన్‌కంట్రోల్ అండ్ సెన్సార్ టెక్నాలజీ, ఇండస్ట్రీ 4.0, స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్ విభాగాల్లో శిక్షణలు ఇస్తున్నారు.

ఎన్జీఓలకు చేయూత ఇవ్వాలి

బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మానవతా దృక్పథంతో కార్యక్రమాలు కొనసాగించే స్వచ్ఛంద సంస్థలకు చేయూత ఇవ్వాలని కన్వర్జెన్స్ ఫౌండేషన్‌కు చెందిన బిక్రమ్ దౌలత్‌సింగ్ అభిప్రాయపడ్డారు. 'ది సిస్టమ్‌చేంజ్ అప్రోచ్' అనే విధానం సమాజంలో మార్పు తెచ్చేందుకు సాధ్యం కానుందన్నారు. కన్వర్జెన్స్ ఫౌండేషన్, రోహిణి నీలేకణి ఫిలాంత్రఫీస్, సెంటర్ ఫర్ ఎక్స్‌పోనెన్షియల్ చేంజ్ అండ్ ఇండియా ఇంపాక్ట్ శెర్వాస్ సహకారంతో సమాజంలో మార్పుపై ఏర్పాటైన సదస్సులో పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి సాధకులు, ఆలోచనాపరులు, మంచిని కోరేవారు ఒకే గూటికి చేరితో వ్యవస్థలో మార్పు తెచ్చేందుకు వీలవుతుందన్నారు. ఇదే సంద ర్భంగా సంజయ్ పురోహిత్ రచించిన మూడో ఎడిషన్ థింక్ సుస్టైన్ పుస్తకాన్ని రోహిణి నిలేకణి ఆవిష్కరించారు. సమాజంలో పురోగతి, మార్పుకోసం పలు అంశాలపై వారు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.



సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

అందం, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వండి

▸▸ నటి తమన్నా భాటియా

బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అందం ఆరోగ్యంకు ప్రతిమహిళ ప్రాధాన్యత ఇవ్వాలని ప్రముఖ నటి తమన్నాభాటియా అభిప్రాయపడ్డారు. షిసియిడో చర్మ సౌందర్య ఉత్పత్తులను తమన్నా లాంఛనంగా ఆవిష్కరించారు. మాల్ ఆఫ్ ఏసియాలో జరిగిన కార్యక్రమంలో తమన్నాను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. ఈ సందర్భంగా జపాన్‌కు చెందిన ప్రముఖ బ్రాండ్ షిసియిడో మరిన్ని పరిశోధనలతో విటల్ పెర్‌ఫెక్షన్‌ను అందం తెచ్చేలా రూపొందించారన్నారు. కంపెనీ వైస్‌ప్రెసిడెంట్ నికోలస్ బొజోనెట్ మాట్లాడుతూ మా బ్రాండ్‌కు 150 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా తగిన ఉత్పత్తులు తీసుకొస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా తమ ఉత్పత్తులు మార్కెటింగ్ చేయడం సంతోషంగా ఉందన్నారు. అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న నటి తమన్నా

పొగాకు వాడకానికి దూరంగా ఉండాలి

శిడ్లఘట్ట, జూన్ 26: ఆరోగ్యానికి హానికరమైన పొగాకు వాడకానికి దూరంగా ఉండాలని తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటేశ్‌మూర్తి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కేఎస్ఆర్టీసీ బస్టాండ్‌లో వరల్డ్ నో టొబాకో డేలో భాగంగా తాలూకాస్థాయి ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. కేఎస్ఆర్టీసీ అధికారి మూర్తి మాట్లాడుతూ పొగాకు వస్తువులైన బీడీ, సిగరెట్ ఇతర వస్తువులను పిల్లలచే కొనిపించరాదన్నారు. పిల్లలకు మంచి అలవాట్లు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ధూమపాన వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆరోగ్యశాఖ అధికారులు దేవరాజ్, డాక్టర్‌లు స్వాతి, భరత్, రాఘవేంద్ర, తాలూకా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అధికారి మునిరత్నమ్మ, గీతా, విజయమ్మ, ధనంజయ, సునిల్, జీవిక, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరంలో డాక్టర్ వెంకటేశ్‌మూర్తి తదితరులు

కోర్టుకు ప్రత్యేక బస్సులు నడపండి

బంగారపేట, జూన్ 26: బంగారపేట పట్టణంలోని కేఎస్ఆర్టీసీ బస్టాండ్ నుంచి కోర్టుకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆత్మవిశ్వాస వేదిక, దళిత శక్తిసేన డిమాండ్ చేశాయి. ఈమేరకు భారద్వాజ్ నేతృత్వంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కేఎస్ఆర్టీసీ అధికారి కృష్ణకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్టాండ్ నుంచి కోర్టు, కేసీ రెడ్డి కాలేజ్ వరకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపాలని కోరినట్టు తెలిపారు. తద్వారా విద్యార్థులు, ప్రజలకు ఎంతో అనుకూలం కానుందన్నారు. ఈ సందర్భంగా వెంకటప్ప, మునిరత్నం, మునియప్ప, ఎస్ సజ్జాద్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఐదేళ్లుగా రియల్ వ్యాపారం డీలా

● కూటమి ప్రభుత్వంలో పుంజుకుంటుందన్న ఆశ ● అడ్వాన్సులు ఇస్తున్న వ్యాపారులు

హిందూపురం, జూన్ 26: వైసీపీ ఐదేళ్ల పాలనలో రియల్ వ్యాపారం డీలా పడింది. అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు స్థిరాస్తి వ్యాపారాన్ని దారుణంగా దెబ్బకొట్టాయి. ఐదేళ్లలో భూముల క్రయవిక్రయాలు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. ఇసుక విధానం, రియల్ వ్యాపారులపై వైసీపీ నాయకుల దాడులు, బెదిరింపులు, కబ్జాలతో స్థిరాస్తి వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో రియల్ వ్యాపారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రియల్ వ్యాపారం పుంజుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వ్యాపారాలు మొదలెట్టారు. భూముల కొనుగోలుకు అడ్వాన్సులు ఇచ్చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రియల్ వ్యాపారం కుదేలైంది. కొన్ని చోట్ల కొనుగోలు చేసిన భూములు, ప్లాట్లు ఎవరూ అడగని పరిస్థితి ఏర్పడింది. కొన్ని సందర్భాల్లో కోట్ల రూపాయల విలువచేసే భూములను సైతం వ్యాపారులు లక్షలకు కొనేందుకు జంకారు. వైసీపీ పాలనలో ఎక్కడ లేఔట్ వేయాలన్నా ఆ పార్టీ నాయకులను ఆశ్రయించాల్సి రావడమే ఇందుకు ప్రధాన కారణం. వారికి కొంతమొత్తం ముట్టజెప్పాల్సిందే. కొన్ని ప్లాట్లు సైతం వారికి అప్పగించాలి. చోటామోటా నాయకులకు ఖర్చులకు సైతం ఇచ్చుకోవాలి. వైసీపీ నేతల తీరుతో వెంచర్లు వేసే వ్యాపారులు పరారయ్యారు. హిందూపురం ప్రాంతంలో కర్ణాటకకు చెందిన కొంతమంది లేఔట్లు వేశారు. వారిని అప్పట్లో వైసీపీ నాయకులు బెదిరించారు. బెంగళూరు రోడ్డుకు ఆనుకుని ఒక లేఔట్ వేశారు. అందులో అధికార పార్టీ నాయకులు అడిగినంత ఇవ్వలేక ఆ రియల్టర్ బెంగళూరుకు మకాం మార్చారు. పరిగి మండలంలో లేఔట్లు వేసినవారి నుంచి వైసీపీ నాయకులు భారీఎత్తున డిమాండ్ చేయడంతో వారు మధ్యలోనే ఆపేశారు. హిందూపురం పట్టణ పరిధిలో కూడా కొంతమంది రియల్ వ్యాపారులు లేఔట్లు వేయడానికి ప్రయత్నించగా వైసీపీ నాయకులు అడిగినంత ఇవ్వలేక మధ్యలోనే కర్ణాటకకు తరలి వెళ్లారు. ఇసుక పాలసీ భవన నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపింది. ఇన్ని సమస్యలు చుట్టుముట్టడంతో రియల్ వ్యాపారం పడకేసింది. ఐదేళ్లు అడుగు ముందుకు పడలేదు. ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో రియల్ వ్యాపారం పుంజుకుంటుందన్న ఆశలు వ్యాపారుల్లో చిగురిస్తున్నాయి. విలువైన ప్రాంతాల్లో ప్లాట్లు, భూములకు అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. మరికొన్నిరోజులకు ధరలు పెరిగే అవకాశం ఉందని అడ్వాన్సులు ఇస్తూ.. తమ వద్ద భూములకు సంబంధించిన పత్రాలు పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. హిందూపురం పట్టణానికి ఆనుకుని బెంగళూరుకు వెళ్లే రహదారిలో మడకశిర స్థలాన్ని అనంతపురానికి చెందిన ఓ వ్యాపారి అడ్వాన్సు చెల్లించి, అగ్రిమెంట్ వేసుకున్నాడు. ఇప్పటి వరకు ఆ భూమిని ఎవరూ అడిగేవారుకాదు. కూటమి రావడంతో విక్రయాలు పుంజుకుని, ధరలు పెరుగుతాయన్న నమ్మకంతో సదరు వ్యాపారి అగ్రిమెంట్ వేసుకున్నట్లు తెలుస్తుంది. లే పాక్షి మండలంలో ప్రధాన రహదారికి ఆనుకుని, లేఔట్ వేసేందుకు బెంగళూరుకు చెందినవారు పదెకరాల పొలాన్ని కొనుగోలు చేశారు. సదరు రైతులు మూడేళ్లుగా విక్రయించాలని ముందుకొచ్చినా.. కొనుగోలు చేయడానికి వెనకడుగు వేసేవారు. నాలుగు రోజుల క్రితం అగ్రిమెంట్ వేసుకున్నారు. పట్టణంలో పలు చోట్ల ఇంటి స్థలాలకు సంబంధించి అగ్రిమెంట్లు, అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. ఎన్నికల ముందుకంటే పదిశాతం ధరలు పెరిగినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రియల్ వ్యాపారుల్లో ఆశలు పెరిగాయి.

వేరుశనగ మొక్కలు చనిపోకుండా చర్యలు తీసుకోండి

గోరంట్ల, జూన్ 26: వేరుశనగ మొక్కలు చనిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త జాన్సన్ తెలిపారు. మండలంలోని సింగిరెడ్డిపల్లి సమీపాన వెంకటరామప్ప సాగుచేసిన వేరుశనగ పంటను శాస్త్రవేత్తలు పరిశీలించారు. అక్కడక్కడా వేరుశనగ చెట్లు చనిపోతుండడాన్ని శాస్త్రవేత్త జాన్సన్ గమనించారు. ఆయన మాట్లాడుతూ.. ఎక్సాకోనజల్ 2 ఎం.ఎల్ ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని రైతుకు సూచించారు. వేరుశనగలో పచ్చపురుగు నివారణకు కినాల్‌ఫాస్ 2 ఎం.ఎల్‌గానీ, క్లోరోఫైరిపాస్ 2.50 ఎం.ఎల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మొక్కజొన్న విత్తే ముందు 50 కిలోల యురియా, 150 కిలోల సింగల్ సూపర్‌పాస్పేట్, 25కిలోల పొటాష్ ఎరువులు ఎకరాలో దుక్కి చేసుకోవాలన్నారు. కత్తెర పురుగు సోకకుండా పొలం చుట్టూ నాలుగు సాళ్లలో జొన్నగానీ, సజ్జగానీ వేసుకోవాలని సూచించారు. కత్తెర పురుగు నివారణకు ఇమామెటిన్ బెజెట్ 80గ్రాములు ఎకరాకు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త రామసుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

గౌరి లంకేశ్ హత్యకేసులో
నిందితుల బెయిల్ పెండింగ్

బెంగళూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సీనియర్ పాత్రికేయురాలు, సామాజిక ఉద్యమకారిణి గౌరి లంకేశ్ హత్యకేసులో ఆరోపితులు అమిత్ దిగ్వేకర్‌తోపాటు ముగ్గురు దాఖలు చేసుకున్న బెయిల్ పిటీషన్‌ను మంగళవారం విచారణ జరిపిన హైకోర్టు తీర్పును పెండింగ్‌లో ఉంచింది. ఐదో ఆరోపితుడు అమిత్ దిగ్వేకర్ అలియాస్ అమిత్ అలియాస్ ప్రదీప్ మహాజన్, ఏడో ఆరోపితుడు సురేశ్ హెచ్ఎల్ అలియాస్ టీచర్, 17వ ఆరోపితుడు కేటీ నవీన్‌కుమార్‌లు బెయిల్‌కోసం దరఖాస్తు చేసుకున్న పిటీషన్‌ను న్యాయమూర్తి విశ్వజిత్‌శెట్టి ఏకసభ్య ధర్మాసనం ఆదేశాలను పెండింగ్‌లో పెట్టింది. 11వ ఆరోపితుడు మోహన్‌నాయక్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో మిగిలిన ముగ్గురు కూడా బెయిల్‌కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాగా మోహన్‌నాయక్ బెయిల్ పిటీషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో చేసుకున్న దరఖాస్తు పెండింగ్‌లో ఉంది. 2018 మే 21నుంచి వారు జైలులో ఉన్నారు.

ఘనంగా సంకష్ట చతుర్థి పూజలు



ద్విముఖ గణపతికి ప్రత్యేక అలంకరణ


శిడ్లఘట్ట, జూన్ 26: పట్టణంలోని వివిధ దేవాలయాల్లో సంకష్టచతుర్థిని పురస్కరించుకుని విశేష పూజలు చేశారు. అశోకరోడ్డులోని ద్విముఖ గణపతి ఆలయంలో మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, మహాభిషేకం, హారతి అనంతరం వివిధ పుష్పాలతో అలంకరణ చేశారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. రాత్రి 9 గంటలకు మహా మంగళారతి అనంతరం అన్న సంతర్పణ చేశారు. కృష్ణమూర్తిశాస్త్రి సోదరులు స్వామివారి చరిత్రను వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని పిలేచర్ క్వార్టర్స్‌లోని గాయత్రి గణపతి వెంకటేశ్వర శనిమహాత్ముడి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు సాగాయి. తాలూకాలోని వీరాపుర గ్రామంలో కొలువైన వినాయక ఆలయంలోనూ సంకష్టహర చతుర్థి పూజలు నిర్వహించారు.

పౌరకార్మికుల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరం



ఆరోగ్య శిబిరంలో వైద్యాధికారులు తదితరులు

మహదేవపుర, జూన్ 26: బెంగళూరు నగరాన్ని స్వచ్ఛంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న పౌర కార్మికుల ఆరోగ్యం కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మహదేవపుర డివిజన్ పరిధిలో ఏర్పాటైన శిబిరాన్ని ఆరోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వరయ్య పర్యవేక్షించారు. కృష్ణరాజపుర ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. మహదేవపుర డివిజన్ కమిషనర్, జా యింట్ కమిషనర్ డైరెక్టర్ ఆదేశాల మేరకు దేవసంద్ర, కేఆర్ పుర, బసవనపుర వార్డు పరిధిలోని 280 పౌర కార్మికులకు పరీక్షలు చేసినట్టు తెలిపారు. బీపీ, షుగర్ సహా అనేక జబ్బులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఇకపై పౌర కార్మికుల ఆరోగ్య దృష్ట్యా తరచుగా వార్డులవారీగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా బీబీఎంపీ అధికారులు పనిచేస్తున్నారన్నారు. వర్షాకాలంలో మరిన్ని ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆసుపత్రి పాలనా వైద్యాధికారి డాక్టర్ అశోక్‌రెడ్డి, వైద్యాధికారి డా. బాబు మహేంద్ర ప్రసాద్, బీబీఎంపీ సహాయక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనిధి, తాలూకా ఆరోగ్య అధికారి వింధ్య, తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,581.29	1,579.12
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	604	228
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,995	1328
సామర్థ్యం (టీఎంసీలు)	5.13	4.06

నేడు కెంపేగౌడ జయంతి

- ఘనంగా నిర్వహించాలని ఆదేశాలు



బళ్లారి సిటీ, జూన్ 26: విజయనగరం జిల్లాలో గురువారం నాడప్రభు కెంపేగౌడ జయంతి నిర్వహించనున్నామని ప్రతి తాలూకాలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని విజయనగరం అదనపు జిల్లాకలెక్టర్ అనురాధ తె లిపారు. కార్యక్రమం ఎలా ఉండాలో వీడియో ఇంటరాక్షన్ ద్వారా సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని తాలూకాల్లో తప్పనిసరిగా కెంపేగౌడ జయంతిని ప్రత్యేకంగా నిర్వహించేందుకు బృహత్ బెంగళూరు మహా నగర పాలిక(బీబీఎంపీ) ద్వారా రూ.లక్ష గ్రాంట్ విడుదల చేయనున్నారని జయంతి ఉత్సవాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ సహాయసంచాలకులు సిద్దలింగేశ్ రంగన్ననవర్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

13న రాష్ట్రీయ లోక్ అదాలత్

బళ్లారి సిటీ, జూలై 26: ప్రజలు ద్వేషాలను మరచి సహజీవనం చేయాలనే లక్ష్యంతో జూలై 13న రాష్ట్రీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు హొస్పేట ప్రధాన సివిల్ కోర్టు న్యాయాధికారి ప్రశాంత్ నాగలాపూర్ తెలిపారు.

అధికారుల ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా లోక్ అదాలత్‌ను ఏకకాలంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో ప్రీ లిటిగేషన్ కేసులు, బ్యాంక్ కేసులు, చెక్‌బౌన్స్, మనీ రికవరీ, వివాద కేసులు, విద్యుత్ బిల్లు, నీటి బిల్లు, వివాహ సంబంధిత కేసులు సహా భూ వివాద కేసులు, అభ్యర్థనపై రాజీ ద్వారా పరిష్కరిస్తారన్నారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర సమాచారం కోసం దూరవాణి సంఖ్య 9480662155ను సంప్రదించాలని న్యాయాధికారి తెలిపారు.

మానప్పాచారి సేవలు మరువలేనివి



మానప్పాచారిని అభినందిస్తున్న పదాధికారులు

కంప్లి, జూన్ 26 : పశువుల వైద్యుడిగా మానప్పాచారి సేవలు మరువలేనివని ఆలుమత సమాజం ప్రముఖులు కామేష్ తెలిపారు. ఆయన కుడితిని, సిద్దమ్మనహళ్లి తదితర గ్రామాలలో ఎన్నో సేవలు అందించారు. పశువుల కాపరులు, రైతులు, ఎప్పుడు వెళ్లినా పశువుల ఆస్పత్రిలో ఎప్పుడూ అందుబాటులో వుండి సేవలందించారన్నారు. ప్రతి ఒక్క పశువైద్యుడు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన రిటైర్ కావడంతో ఆయనను కుడితినిలో ఆలుమత సమాజం ఆధ్వర్యంలో అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా మానప్పాచారి మాట్లాడుతూ నిత్య జీవితంలో కుడితిని గ్రామస్తులు, రైతన్నలను, గొర్రెల కాపరులను మరువలేమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొర్రెల కాపరులు, ఆలుమత సమాజ ప్రముఖులు, కనకదాస యువక సంఘం పదాధికారులు, తదితరులు పాల్గొన్నారు.


పదాధికారుల నియామకం



ఎన్నికైన రైతు సంఘం నాయకులు

కంప్లి, జూన్ 26 : రాష్ట్ర రైతు సంఘం హసురుసేన గౌరవాధ్యక్షులుగా దేవేంద్ర, అధ్యక్షులుగా సీఏ చెన్నప్ప, ఉపాధ్యక్షులుగా మహదేవ, విరుపన్న, కోశాధికారిగా మంజునాథ్, సంచాలకులుగా మంజునాథ్, దేవప్ప, కార్యదర్శులుగా ఉలిగప్ప, పరమేష్, నాగరాజు ఎంపికయ్యారు. సంఘటన కార్యదర్శి గా పరమేష్ దేవప్ప ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చెన్నప్ప, దేవేంద్రప్ప మాట్లాడుతూ రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొని పోరాడడానికి ముందుకు రావాలని సూచించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక తల్లడిల్లుతున్నారన్నారు.

- కాంగ్రెస్ నుంచి ఎంపీ తుకారాం భార్య లేదా కుమార్తె
- బీజేపీ నుంచి సరైన అభ్యర్థికోసం వెదుకులాట



సండూరు ఉపఎన్నికలో అభ్యర్థుల కోసం అన్వేషణ

బళ్లారి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా సండూరు అసెంబ్లీ నియోజక వర్గ ఉప ఎన్నికలో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎవరనే దానిపై అందరూ చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా ఉన్న తుకారాం లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందడంతో ఈ స్థానం ఖాళీ అయిన విషయం విదితమే. ఆయన ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేసి ఎంపీగా కొనసాగుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం నాలుగు శాసనసభ స్థానాలకు ఖాళీ ఏర్పడగా, అందులో సండూరు కూడా ఒకటి కావడం గమనార్హం.

ప్రధానంగా సండూరు అంటే మైనింగ్ రాజుల అడ్డాగా చెప్పవచ్చు. ఈ స్థానం ఎస్టీ కేటగిరీకి రిజర్వు అయింది. ఈనేపథ్యంలో ఇక్కడ నుండి ప్రస్తుత ఎంపీ తుకారాం భార్య అన్నపూర్ణ, లేదా కూతురు చైతన్య పోటీలో ఉండే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. తుకారాం ఎంపీ గా పోటీ చేసే ముందే సండూరు ఎమ్మెల్యే టిక్కెట్‌ను తన కుటుంబం లో ఒకరికి ఇచ్చేవిధంగా కాంగ్రెస్ పెద్దల హామీ పొందినట్లు తెలుస్తోంది. ఇక అదే జరుగుతుందా..? లేదా కొత్త అభ్యర్థిని రంగంలో నిలుపుతారా అనేది తేలాల్సిఉంది. బీజేపీ కూడా కొత్త అభ్యర్థి కోసం అన్వేషణ ప్రారంభించింది. మాజీ మంత్రి, శ్రీరాములు, లేదా జే.ఎస్ దివాకర్ పోటీలో ఉండే అవకాశం కనిపిస్తోంది. ఇంతకు ముందు బీజేపీ నుంచి పోటీ చేసిన శిల్పా రాఘవేంద్ర కూడా పోటీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి సండూరులో ఎవరు ఏ పార్టీ నుండి పోటీ చేయాలనుకున్నా అక్కడ లాడ్స్, లేదా గోర్పడే రాజుల మద్దతు ఉండాల్సిందే. అక్కడ కాంగ్రెస్ నుంచి అయితే సంతోష్‌లాడ్ చెప్పిన వారికే టికెట్ ఇస్తారు. ఇది ముందు నుంచి జరుగుతున్నదే. ఇక బీజేపీ లోనయితే గోర్పడే రాజులు చెప్పిన వారికే టికెట్ ఇస్తారు. గోర్పడే రాజులు శిల్పారాఘవేంద్రకు మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. అలాగే ఇంతకు మునుపు జనార్దన్‌రెడ్డి పార్టీ నుండి పోటీచేసి ఓడిన దివాక్ కూడా ఇక్కడ టికెట్ ఆశిస్తున్నారు. మొత్తం మీద సండూరు ఉపఎన్నికలను అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం రెండూ ప్రతిష్టాత్మకంగానే తీసుకుంటున్నాయి.

వెలగని విద్యుత్ లైట్లు



దిష్టిబొమ్మలా నిలిచిన విద్యుత్ స్తంభం

కంప్లి, జూన్ 26 : కంప్లి పట్టణంలో రాత్రివేళల్లో విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్ని సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చీమకుట్టినట్లు కూడా లేకపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంప్లి 23 వార్డులో రాత్రివేళల్లో విద్యుత్ లేక బయటకు రావాలన్నా ఇబ్బందిగా మారిందని తెలిపారు. ఇప్పటికైనా వీధిదీపాలు వెలిగేలా చూడాలని కోరుతున్నారు.

ఘనంగా సంకష్ట హర చతుర్థి పూజలు

సిరుగుప్ప, జూన్ 26 : పట్టణంలోని మహాశక్తి గణపతి ఆలయంలో మంగళవారం ఘనంగా గణేష సంకష్ట హర చతుర్థి పూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు శ్యామాచార్య ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, సహస్రనామార్చన తదితర సేవలు నిర్వహించారు. భక్తులు పగలంతా వివిధ ధార్మిక కార్యక్రమాలు చేపట్టి ఉపవాసం చేసి సాయంత్రం పూజల్లో పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం హానికరం

న్యాయాధికారి రాజేశ్ హొసమనె



మాట్లాడుతున్న న్యాయాధికారి రాజేశ్ హొసమనె తదితరులు

బళ్లారి సిటీ, జూన్ 26: డ్రగ్స్ తీసుకోవడం వలన శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని న్యాయాధికారి రాజేశ్ హొసమనె పేర్కొన్నారు. జిల్లా సమాచార, పౌర సంబందాల శాఖ జిల్లా మానసిక ఆరోగ్య విభాగం వారి సంయుక్త ఆధ్వర్యంలో బళ్లారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన డ్రగ్స్ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇటీవలి కాలంలో డ్రగ్స్ విదేశాల నుంచి అక్రమంగా రవాణా అవుతున్నాయన్నారు. వీటిని వినియోగించడం నేరమని ఎవరైనా ఈ నేరంలో భాగస్వాములైతే చట్ట ప్రకారం శిక్షిస్తామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణతో కూడిన జీవితం ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ విభాగం సైకియాట్రిస్ట్ డాక్టర్ రోహన్ వానగుండి, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు, బిఐటీఎం కళాశాల ప్రిన్సిపాల్ యడవల్లి బసవరాజు, డా.వీరేంద్రకుమార్, పోలీస్ వెంకటేశ్, డా.పూర్ణిమ, క్షయ నియంత్రణ అధికారి ఇంద్రాణి, మరియంబి, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగం నేరం



కంప్లి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి అరుణ్

కంప్లి, జూన్ 26 : ఎవరైనా గుట్కా, పాన్ పరాగ్, గాంజా ఉపయోగించడం వల్ల అనారోగ్యం పాలవుతారని, వాటిని ఉపయోగించడం నేరమని తాలుకా ఆరోగ్య అధికారి డాక్టర్ అరుణ్ తెలిపారు. కంప్లి పట్టణంలో అంతర్రాష్ట్రీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరు చెడు అలవాట్లకు దూరంగా వుండి తన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. వారితో పాటు డాక్టర్ భరత్ కుమార్, మల్లేశప్ప, శోభ, బసవరాజు, వీరణ్ణ, చెన్న బసవరాజు, ప్రకాష్‌గౌడ, నాగరాజు, దేవన్న, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంసీలో ఏళ్ళనాటి పూడికకు మోక్షం

- యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీల క్లీనింగ్
- ఊపిరి పీల్చుకున్న వర్తకులు
- పనులు ప్రారంభించిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు



పూడికతీత కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్షులు నాగేంద్రప్ప

బళ్లారి గాంధీనగర్, జూన్ 26: ఎట్టకేలకు బళ్లారి ఏపీఎంసి అధ్యక్షుల చొరవతో ఏళ్ళనాటి పూడికకు మోక్షం లభించింది. బళ్లారి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సమితి అధ్యక్షులు కట్టెమనె నాగేంద్రప్ప, ఉపాధ్యక్షులు కొళగల్లు హరాలప్ప, ఏపీఎంసి సెక్రటరీ నంజుండస్వామిలు ఏపీఎంసిలో ప్రాంగణంలో నెలకొన్న సమస్యలను మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎక్కడకు వెళ్లినా.. ఏపీఎంసీలో డ్రైనేజీ పూడిక ప్రధాన సమస్యగా కనిపించడంతో అధ్యక్షులు నాగేంద్రప్ప ఏపీఎంసి నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యారని సెక్రటరీ నంజుండస్వామిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏటా లక్షలాది రూపాయల డ్రైనేజి నిర్వహణ, క్లీనింగ్ కోసం ఖర్చు చేస్తున్నా ఫలితం లేదని భావించిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు చొరవతో ఏకంగా మరుసటి రోజైన బుధవారం ఇద్దరు రెండు జేసీపీలు, పదికి పైగా ట్రాక్టర్లు ఏర్పాటు చేసి ఏపీఎంసి ప్రధాన రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా పూడిక తీత పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ఆలస్యం అమృతం విషయం అన్నట్టుగా, అభివృద్ధి పనులకు ఏవరో ఒకరు అడ్డుతగులుతారనే ఉద్దేశ్యంతో ఉదయం నుండి సాయంత్రం వరకు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు నిలబడి పూడిక తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. ఇన్ని రోజులు వర్షం నీటితో ఇబ్బందులు ఎదుర్కొన్న వ్యాపారులు బుధవారం పూడిక తీత పనులతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. దశాబ్దంపైగా డ్రైనేజిలు పూడిపోయాయని, ఏపీఎంసి పాలనా మండలికి ఎంతోమంది అధ్యక్షులు వచ్చినా ఇంతవరకు ఈ స్థాయిలో పనులు చేపట్టలేదని అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ విభాగం సుదర్శన్, ప్రముఖులు కమ్మ వెంకట నాయుడులతో విశ్వ, అక్కి నాగరత్న, కేశవ, విశ్వనాయక్, బీరీ సాబ్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

వర్తకుల సమస్యలను పరిష్కరించండి

బళ్లారి ఏపీఎంసి మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరించాలని బళ్లారి ఏపీఎంసి దళారీ వర్తకుల సంఘం ఏపీఎంసి అధ్యక్షులు కట్టెమనె నాగేంద్రప్పను కోరింది. బుధవారం మార్కెట్‌లో డ్రేనేజీ పూడిక తీత పనులను ప్రారంభించడం పట్ల స్థానిక వర్తకులు హర్షం వ్యక్తం చేశారు. ఇదే సదర్భంలో మార్కెట్‌లో నెలకొన్న సమస్యలపై అధ్యక్షుల ఆధ్వర్యంలో సెక్రటరీ బసవరాజుకు వినతి పత్రం అందజేశారు. ప్రధాన గేటు ద్వారం ప్రారంభమై ఏడేళ్ళు గడుస్తున్నా ఇంతవరకు పూర్తి కాలేదని, వీలైనంత త్వరలో పూర్తి చేసి మార్కెట్‌కు ఐకాన్‌గా నిలిచేలా చేయాలన్నారు. మార్కెట్‌లో నిత్యం పశువులు, గొర్రెలు, మేకల బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. అందుకు స్పందించిన ఆయన వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. ఈ సందర్భంగా దళారీ వర్తకుల సంఘం అధ్యక్షులు చిదానందతో పాటు సంఘం సభ్యులు, ఏపీఎంసి అధికారులు పాల్గొన్నారు.

జనతా దర్శన్‌లో సమస్యల పరిష్కారం

బళ్లారి సిటీ,జూన్ 26: ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జనస్పందన కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు అందజేయవచ్చని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తె లిపారు. అనంతపురం రోడ్డులోని నూతన జిల్లా పాలనా భవనంలో బుధవారం నిర్వహించిన జనతా దర్శన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాయంత్రాంగం జనతా దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించి సమస్యలను విని పరిశీలించి పరిష్కరిస్తోందని, సమస్యలున్న ప్రజలు జనతా దర్శన్ కార్యక్రమంలో పాల్గొని తమ ఫిర్యాదులను అందజేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ప్రజల ఫిర్యాదులను ఉత్సాహంగా స్వీకరించారు. కొన్ని సమస్యలపై స్పందించి అక్కడికక్కడే పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి మొత్తం 27దరఖాస్తులు వచ్చాయి. ఈకార్యక్రమంలో జిల్లాపంచాయితీ కార్యనిర్వహణాధికారి రాహుల్‌శరణప్ప, అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా, సబ్ డివిజనల్ అధికారి హేమంత్,ఏఎస్పీ నవీన్‌కుమార్, తహసీల్దార్ గురురాజ్‌తో పాటు జిల్లా తాలూకా స్థాయి అధికారులు, సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

అగ్నిపథ్ ప్రాజెక్టును విరమించుకోవాలి



కలెక్టర్ సిబ్బందికి వినతి పత్రం సమర్పిస్తున్న ఏఐవైఎఫ్

బళ్లారి సిటీ, జూన్ 26: భారత దేశంలో భారతీయ సైన్యం చాలా ముఖ్యమైనదని, దేశంలో రెండవ అతిపెద్ద ఉద్యోగాలిచ్చే సంస్థ ఇదేనని ఏఐవైఎఫ్ జిల్లాధ్యక్షులు కట్టె బసప్ప పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అగ్నిపథ పథకాన్ని అమలుచేసి వారికి కల్పించిన ఉద్యోగ భద్రతను పణంగా పెట్టిందన్నారు. అగ్నిపథ పథకం మొదటి దశ యువత ఇప్పటికే తమ సేవను పూర్తి చేస్తున్నారని, వారి భవిష్యత్తుఏమిటని ప్రశ్నించారు. వారి జీవితాంతం వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం నుండి వచ్చే కొద్దిపాటి ఆర్థిక సహాయం సరిపోదని, యువత తమ విద్యకు స్వస్తిచెప్పి, షార్ట్ టర్మ్ సర్వీస్ పూర్తి చేసి చిన్న వయస్సులోనే రిటైరైతే ఉపాధిలేని పరిస్థితిలో కూరుకుపోతుందన్నారు. దేశ రక్షణ పరంగా కూడా సైన్యంలో స్వల్పకాలిక మోహరింపు సరికాదని, ఈ ప్రాజెక్టు ప్రమాదాన్ని సూచిస్తోందన్న అభిప్రాయం సైనిక ఉన్నతాధికారుల సర్కిల్లో వినిపిస్తోందన్నారు. కావున దేశ భద్రత, యువతకు సురక్షిత ఉపాధి, సైన్యంలో రిక్రూట్ మెంట్ వంటి వాటిని దృష్టిలో ఉంచుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య సండూర్ తాలూకా కమిటీ కోరింది. ఈ సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య సభ్యులు అగ్నిపథ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లాకలెక్టర్ సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు.

ఘనంగా ఏఐడీవైఓయూ ఆవిర్భావ దినోత్సవం

బళ్లారి సిటీ, జూన్ 26: నగరంలో బుధవారం ఏఐడీవైఓయూ ఆవిర్భావ దినోత్సవాన్ని బళ్లారి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఘనంగా నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ పండితారాధ్య, ఏఐడీవైఓయూ రాష్ట్ర అధ్యక్షుడు శరణప్ప ఉద్బాల్ ప్రారంభించారు. కళాశాల హాల్లో విద్యార్థులను ఉద్దేశించి శరణప్ప ఉద్బల్ మాట్లాడుతూ నేటి కాలంలో సామాజిక బాధ్యత, నైతికత వంటి విలువలు పతనమవుతున్నాయన్నారు. సమాజంలో ముఖ్యంగా విద్యార్థుల్లో జీవితాన్ని ఎదుర్కొనే ధైర్యం కొరవడుతోందని, చిన్న చిన్న విషయాలకు కూడా హత్యలు, దోపీడీలు వంటి ఘటనలు చోటుచేసుకోవడం విస్మయం కలిగిస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యువతలో ఉన్నత విలువలను పెంపొందించేందుకు ఏఐడీవైఓ యూత్ ఆర్గనైజేషన్ దేశవ్యాప్తంగా కృషి చేస్తోందన్నారు. మహనీయుల ఆదర్శ జీవితాలను విద్యార్థుల్లో ప్రచారం చేయడం ద్వారా యువత వాటిని తమ జీవితంలో అలవర్చుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరం, నేత్రదాన ప్రతిజ్ఞ, రక్తదాన శిబిరం, గ్రామీణ క్రీడా కార్యక్రమాలు లాంటి పది రకాల కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళుతున్నామన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బళ్లారిలో మొక్కలు నాటడం సామాజిక చింతన ఉన్న ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. నేడు విద్యార్థులు సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లలో మునిగిపోయి ఆన్‌లైన్ గేమ్‌లు, వికృత చేష్టలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అలా కాకుండా అన్యాయానికి వ్యతిరేకంగా గళం విప్పాలని, మహనీయుల ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని జీవితాలను గడపాలని విద్యార్థులకు సూచించారు. ఈసందర్భంగా ఏఐడీవైఓయూ జిల్లాధ్యక్షుడు పంపాపతి కోళూరు, జిల్లాకార్యదర్శి జగదీశ్‌నేమికల్, కళాశాల అధ్యాపకులు బిరాదార్, జయన్న, గోవిందప్ప, వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న ఏఐడీవైఓయూ రాష్ట్ర అధ్యక్షుడు శరణప్ప

హోసూరు జోన్

లారీపై చెట్టుపడి ఇద్దరు మృతి



లారీపై మర్రిచెట్టు విరిగిపడిన దృశ్యం

హోసూరు జూన్ 26 : హోసూరు ప్రాంతానికి చెందిన మత్తిగిరి కుసనిపాళ్యం నుంచి త్రాగు నీటి ట్యాంకర్ వస్తుండగా 100 ఏళ్ల నాటి మర్రిచెట్టు ఉన్నట్టుండి విరిగి లారీపై పడిపోయింది. చెట్టు డ్రైవర్ సీటుపై పడడంతో లారీలో ఉన్న హోసూరు పాళ్యంకు చెందిన మారప్ప(45), వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు మత్తిగిరి పోలీసులకు, హోసూరు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బుధవారం సాయంత్రం చెట్టును ముక్కలు ముక్కలుగా కట్ చేసి రెండు గంటల పాటు శ్రమించి మృత దేహాలను బయటికి తీశారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం హోసూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో ఆ ప్రాంతంల్లో తీవ్ర విషాదం నెలకొంది.

బాలల పరిరక్షణ కమిటీ సమావేశం

హోసూరు జూన్ 26 హోసూరు పంచాయతీ యూనియన్ కార్యాలయంలో జిల్లా స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి హోసూరు పంచాయతీ యూనియన్ కమిటీ అధ్యక్షుడు శశి వెంకటస్వామి అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా అభివృద్ధి అధికారి కుమారేషన్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శరవణన్, హోసూరు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు శ్రీధర్, ఇంద్రాణి, చైల్డ్ లింక్ నిర్వాహకులు, పంచాయతీ కౌన్సిల్ నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి శరవణన్ బాలల సంరక్షణపై ప్రత్యేక ప్రసంగం చేశారు. అమ్మాయిలకి 18 ఏళ్ల , అబ్బాయిలకు 21 ఏళ్ల నిండకుండానే పెళ్లి చేయకూడదని తెలిపారు.

వాటర్ ప్లాంట్ భవనం ప్రారంభం

హోసూరు జూన్ 26 : హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మొదటి వార్డు జుజువాడిలో సుమారు రూ. 10 లక్షల ఖర్చుతో నీటి శుద్ధీకరణ ప్లాంట్‌ను ప్రారంభించారు. హోసూరు మేయర్ సత్య. కార్పొరేషన్ కమీషనర్ స్నేహా, జోనల్ ప్రెసిడెంట్ రవి, ఇంజనీర్ రాజారాం ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అన్నాడీఎంకే అన్నా యూనియన్ కార్యదర్శి నాగరెడ్డి, శివరాజ్, చంద్రశేఖర్, మంజునాథ్, అన్బు , మాధవన్, చెన్నప్పన్, డీఎంకే జిల్లా కార్యదర్శి వడివేల్, చంద్రమోహన్, మహిళా బృందం బాధ్యులు జయలక్ష్మి, షర్మిళ, విజయలక్ష్మి, శీల తదితరులు పాల్గొన్నారు.



నీటి శుద్ధి ప్లాంట్ భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

విమానయానానికి అడ్డంకులు తొలగించండి: ఎంపీ



కేంద్ర వియానయాన శాఖ మంత్రి రామ్‌మోహన్ నాయుడుతో చర్చిస్తున్న ఎంపీ

రాయచూరు, జూన్ 26 : నగర సమీపంలో యరమరస్ వద్ద నిర్మించతలపెట్టిన విమానయానానికి సంబంధించి సాంకేతిక సమస్యలను పరిష్కరించి పనులకు అనుమతించాలని రాయచూరు ఎంపీ కుమార్‌నాయక్ కోరారు. బుధవారం కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్‌మోహన్ నాయుడును కలిసి ఈ మేరకు వినతి పత్రం ఇచ్చారు. విమానయానానికి కావల్సిన భూసేకరణ ఇప్పటికే పూర్తి కాగా ప్రభుత్వ భూమి ఆక్రమణకు సంబంధించి తొలగింపులు ఇతరత్రా సాంకేతిక కారణాల రీత్యా పనులు వాయిదా పడుతున్నట్లు తెలిపారు. విమానయాన సంస్థ అధికారులు స్థలపరిశీలన జరిపి అనుమతి మంజూరు చేయడంలో చేస్తున్న జాప్యం వల్లే పనులు ప్రారంభం కావడం లేదన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విమానయాన నిర్మాణానికి పూర్తి సంసిద్ధంగా ఉందన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి విమానయాన నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని కోరారు. కాగా తాము చేసిన విజ్ఞప్తి పట్ల కేంద్ర వియానయాన శాఖ మంత్రి రామ్‌మోహన్ నాయ్డు సానుకూలంగా స్పందించారని త్వరలోనే విమానయాన నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని ఎంపీ కుమార్ నాయక్ తెలిపారు.

యువతి ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్టు

రాయచూరు, జూన్ 26: ప్రేమించిన వ్యక్తి తనను పెళ్లి చేసుకునేందుకు నిరాకరించాడన్న మనస్తాపంతో ఈనెల 21న నగరంలోని మహిళ స్వాంతన కేంద్రం వద్ద యువతి ఆత్మహత్యకు పాల్పడిన కేసులో నిందితుడు వినోయ్‌రెడ్డిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. కేవలం కులం పేరుతో యువతిని వివాహం చేసుకునేందుకు నిరాకరించాడన్న కారణంగా యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని బాలిక మృతి

రాయచూరు, జూన్ 26 : వేగంగా వెళుతున్న కారు ఢీకొట్టిన సంఘటనలో బాలిక అక్కడికక్కడే మృత్యువాత పడింది. మస్కి నుంచి గిణివారకు వేగంగా వెళుతున్న కారు సింధనూరు తాలూకా మాడసిరవార గ్రామం సమీపంలో రోడ్డుపై అడ్డంగావచ్చిన బాలికను ఢీకొట్టింది. మృతి చెందిన బాలిక మాడసిరవార గ్రామానికి చెందిన సుహానా(7)గా గుర్తించారు. మస్కిపోలీసులు కేసు నమోదుచేసి, బాలిక మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.